క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి

పెదవేగి : బాల్య వివాహాలను అరికట్టాల్సి బాధ్యత అందరిపై ఉందని అమ్మపాలెం సర్పంచ్ దేవరపల్లి ఏసుమరియమ్మ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం అమ్మపాలెం లోని సచివాలయం వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామస్థాయిలో బాల్య వివాహ నిరోధక పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కమిటీలో సర్పంచ్ చైర్ పర్సన్ గా, మహిళా పోలీస్ కన్వీనర్ కమిటీని ప్రతి మూడు నెలలకు ఒకసారి బలోపేతం చేసి బాల్య వివాహాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ పంచాయతీ సెక్రటరీ పి.విజయ రాజేష్, వీఆర్వో వై అమర్ నాథ్, వార్డు మెంబర్ బాలిన సురేష్, వీఏఓ కే వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు డి ఏబేలు రాజు, వై కోటేశ్వరరావు, క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు ఏఎన్ఎం ఆశా వర్కర్లు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కామేశ్వరరావు నియామకంపై హర్షం

భీమడోలు: కోనసీమ వాసిగా అపారమైన రాజకీయ అనుభవం కలిగిన పేరి కామేశ్వరరావుకు రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంపై గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి జిల్లాల కార్యవర్గం శుక్రవారం హర్షం వ్యక్తం చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణ సంక్షేమానికి చేస్తున్న పథకాలు అర్హులందరికీ సకాలంలో అందేలా చైర్మన్ కామేశ్వరరావు సేవలందిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీబొట్ల పార్వతీశ్వర శర్మ, కోశాధికారి అమ్మనమంచి మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు తదితరులు హర్షం వ్యక్తంచేసిన వారిలో ఉన్నారు.

ఉల్లాసంగా సాగిన చదవడం మాకిష్టం

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో దసరా సెలవుల నేపథ్యంలో నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం శిక్షణ తరగతులు శుక్రవారం ఉల్లాసభరితంగా సాగాయి. జిల్లా కార్యదర్శి ఎం. శేఖర్‌బాబు ఆదేశాల మేరకు భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని సామూహిక పఠనం చేసి వాటి సమీక్షలు రాసారు.

కథలు చెప్పడం ఒక కళ

పెదవేగి : కథలు చెప్పడం ఒక కళ అని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. దసరా ప్రత్యేక శిబిరంలో భాగంగా పెదవేగి శాఖాగ్రంథాలయంలో శుక్రవారం కథలు చెప్పడం, వ్యాఖ్యానాలు రాయడంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

గణపవరం: పేదల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని, అందులో భాగంగానే ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తూ పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని గణపవరం మండలం జల్లికొమ్మర సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు బుద్దాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం జల్లికొమ్మరలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, తహశీల్దార్ పమ్మి లక్ష్మి మాట్లాడుతూ 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అందజేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కురెళ్ల త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షుడు బుద్దాల అర్జున్ పాల్గొన్నారు.

సిబ్బందికి యూనిఫాం పంపిణీ

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్‌లోని చివరి తరగతి సిబ్బందికి శుక్రవారం యూనిఫాం అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాంను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిఫాం అందరినీ ఐక్యంగా ఉంచేందుకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యాలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి, పలువురు జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ

ఏలూరు (టూటౌన్): మానవత ఆధ్వర్యంలో 25 మంది చిన్నారులకు పోషకాహారం అందజేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న ఆర్‌బీఎస్‌కే సెంటరులో శుక్రవారం పోషకాహారాన్ని అందజేశారు. మానవత జిల్లా కేంద్ర నియంత్రణ, విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు సౌజన్యంతో పోషకాహారాన్ని నందిగం దివ్యశ్రీ సాకారంతో భోజనాలను అందించారు. మేడికొండ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని మేడికొండ పద్మజ చిన్నారులకు పండ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో మానవత ఏలూరు నగర అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు, రీజియన్ చైర్మన్ పోలవరపు దేవరత్నాకరరావు, ఏలూరు మండల చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, కోశాధికారి అల్లూరి మోహిని, సంయుక్త కార్యదర్శి వల్లూరుపల్లి సాయిసుధ, డాక్టర్ శాస్త్రి, డాక్టర్ బ్యూలా పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన



పెదపాడు: వట్లూరు శివారు సీతారామపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



భీమడోలు: ఆగడాలలంకలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి కె.కల్యాణి

భీమడోలు: కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎంపీపీ కనమాల రామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరైన 602 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య పరిస్థితిని నమోదు చేసారు. గైనిక్, పిల్లల వైద్య నిపుణులు శ్రీఆంజనేయ, కె.కల్యాణి, అపర్ణ రోగులకు పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులను అందించారు.సర్పంచ్ భలే రాంబాబు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో 2 భాస్కర్‌కుమార్, గ్రామకార్యదర్శి మురళీ, సచివాలయ ఉద్యోగులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమే..మహాబాగ్యం

పెదవేగి : ఆరోగ్యమే...మాహా భాగ్యమనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం పేదవారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని పెదవేగి తహసీల్దార్ ఎస్ నాగరాజు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం పెదవేగి మండలం బాపిరాజు గూడెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కంటి విభాగ వైద్య నిపుణులు అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అరుణ్‌కుమార్, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే వెంకట సుబ్బారావు(బాబూరావు), వీరమాచినేని నాగబాబు, మార్గని కిషోర్, బొట్ల వెంకటేశ్వరరావు, బొప్పన రమేష్, బొప్పన కృష్ణారావు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. శుక్రవారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ఎంఎల్‌హెచ్‌పీ బి రచన తెలిపారు. కుటుంబానికి ఒక టోకెన్ ఇస్తున్నామని చెప్పారు. ఈ టోకెన్‌తో వచ్చిన వారికి గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పంజగల నరశింహరావు, ఆశ వర్కర్ ఎం మరియమ్మ, వలంటీర్ అజయ్‌కుమార్ ఉన్నారు.

410 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం భద్రత, భరోసా అని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు. గ్రామ కమిటీ అధ్యక్షులు పోకల రాంబాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. శుక్రవారం దెందులూరు సచివాలయంలో పోకల రాంబాబు, ఎంపీటీసీలు పులిపాటి ఆనంద్, తోట విజయకుమారి, తాళ్లూరి నాగరాజు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 410 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, ఐనంపూడి రాము, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, కట్టా వెంకట సుబ్బారావు, అధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యవంతమైన గ్రామాలు

పెదపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యం మెరుగపడటంతో గ్రామాలు ఆరోగ్యవంతమైన గ్రామాలుగా మారతాయని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు శివారు సీతారామపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసి స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ అక్కినేని గోపి, స్థానిక నాయకులు చింతా మదుసూధనరావు, గుజ్జుల నవీన్, బత్తుల ఏసురాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి ఈఓఆర్డీ సూర్యకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీడీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

ఉంగుటూరు(గణపవరం): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు ఆర్‌బీకే-1లో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ సింహాద్రి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెట్టప్రాంత రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం ఆర్‌బికేలకు లారీలను ముందుగానే ట్యాగ్ చేయాలని, రైతులకు సబ్సిడీపై బరకాలు సరఫరా చేయాలని కోరారు. మండలంలోని ఎ.గోకవరం, నాచుగుంట, నీలాద్రిపురం, కాగుపాడు, ఉంగుటూరు, గోపీనాథపట్నం ఆర్‌బీకేల పరిధిలోని ధాన్యం కొనుగోలు బాధ్యతలను నారాయణపురం సొసైటీకి కేటాయించాలని సమావేశంలో తీర్మానాలు ఆమోదించారు. ఈసమావేశంలో సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావు, ఏవో బి.వెంకటేష్, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు సంపతి వెంకట్రావు, రాయి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ

పెదపాడు: వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏలూరు వ్యవసాయ శాఖ రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ పి. లలితా సుధ, ఏడీఏ వై సుబ్బారావు తెలిపారు. ఆత్మ పథకం సౌజన్యంలో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం వసంతవాడలో రైతులకు వారు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి



మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

పెదవేగి : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని కేఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అధికారులకు సూచించారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణాలు కొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయని, ఇది సరైన విధానం కాదన్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా బిల్లులను సకాలంలో అందించే ఏర్పాటు చేయాలని, అప్పుడే లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తారని ఆయన చెప్పారు. ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో కూలీలకు పని కల్పించాలని, వేతనాలు సకాలంలో అందేలా చూడాలని తెలిపారు. దీంతో పాటు స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారానికి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి ఎంపీడీవో జి రాజ్‌మనోజ్, తహసీల్దార్ ఎన్.నాగరాజు, ఎంఈవో సీహెచ్.బుద్ధవాస్, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి జాన్సన్, గృహ, నిర్మాణశాఖ ఏఈ నాగరాజు, ఏపీవో హేమలత పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే అభివృద్ధి



పోతునూరులో చర్చిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

దెందులూరు: ఆధ్యాత్మిక చింతనతోనే అభివృద్ధి, క్రమశిక్షణ అలవడతాయని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. శుక్రవారం పోతునూరు లోగోస్ బాప్టిస్టు చర్చి పాస్టర్ కొమ్మిన సుదర్శన్‌బాబు, మెర్సి దంపతుల ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పీ.బాల, సువార్తీకులు శాంతిసాగర్ మాట్లాడుతూ లోగోస్ బాపిస్టు చర్చి ఆధ్యాత్మిక సేవలో అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరుగా నియమితులైన జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతంను అతిథులు సత్కరించారు.

విజిలెన్స్ మానిటరింగ్ మెంబరుగా జెడ్పీటీసీ లీలా

దెందులూరు: ఏలూరు డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరుగా దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగ రాజు శుక్రవారం నియమితులయ్యారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఈ మేరకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు జెడ్పీటీసీ కార్యాలయంలో నూతనంగా విజిలెన్స్ మానిటరింగ్ మెంబరుగా నియమితులైన లీలానవకాంతంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు ప్రోత్సాహం, సహాయ సహకారాలతో తనకు ఈ పదవి లభించిందన్నారు. కమిటీ నిబంధనలకు అనుగుణంగా మెంబరుగా తన విధి నిర్వహణ నూరు శాతం అమలు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కొఠా రు రామచంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశ సేవకు ముందుకు రావాలి



ఉంగుటూరులో అమృత కలశంతో ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉంగుటూరు(గణపవరం): ప్రతి ఒక్కరూ దేశం పట్ల విధేయత, విశ్వాసం కలిగి దేశ సేవకు ముందుకు రావాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఉంగుటూరులో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా అమత కలశంతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ గ్రామ ప్రధాన వీధులగుండా సచివాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టిని జిల్లా కేంద్రానికి పంపుతున్నట్లు తెలిపారు. అమర వీరుల సంస్మరణార్థం ఢిల్లీలో నిర్మించనున్న అమృత వాటికలో ఈ మట్టిని వినియోగిస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు శిరిమామిళ్ల పెద్దిరాజు, చక్రవర్తి, హరికష్ణ పాల్గొన్నారు.

చింతమనేని దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి



శ్రీరామవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: చింతమనేని ప్రభాకర్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని హితవు పలికారు. శుక్రవారం శ్రీరామవరంలో ఆయన తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చింతమనేనితో పాటు టీడీపీ నేతలు, ఎల్లో మీడియా బాలిక ఉదంతంపై కుట్ర పూరితంగా తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో సాయం అందించకుండా ఈ ఘటనను కూడా రాజకీయం చేయాలని చింతమనేని, టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. బాలికపై లైంగికదాడి కేసు విషయంలో ఆమె కుటుంబాన్ని ఒత్తిడికి గురి చేసినట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని సర్పంచ్ నాని అన్నారు. బాలికతో పాటు గ్రామ వలంటీర్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ, టీడీపీలకు చెందిన పెద్దల సమక్షంలో రాజీ చేసుకుని వివాహం చేసుకుంటామని మాట్లాడుకున్న నేపథ్యంలో పెళ్లికి ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో వలంటీర్ పారిపోయాడన్నారు. బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం తరపు న్యాయం జరిగేలా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌లో బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి టీడీపీ నాయకులు మాట్లాడాలని ఆయన అన్నారు. దీనికి సంబంధం లేదని ఇద్దరు వలంటీర్ల పేర్లు కూడా ఈ కేసులో ఫిర్యాదు చేయడం బాధాకరమని అన్నారు. అసత్య ప్రచారాలు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కామిరెడ్డి నాని హెచ్చరించారు. దోసపాడు ఎంపీటీసీ పెద్దిశెట్టి రోహిణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

చదువుల తల్లి సరస్వతీ.. నమోస్తుతే..

- సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ
- పూజల్లో పాల్గొన్న చిన్నారులు



నిడమర్రు: మండలపర్రులో సరస్వతీ దేవి అలంకరణలో ఉమాదేవి



దెందులూరు: గోపన్నపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



భీమడోలు: గుండుగొలనులో సరస్వతీదేవిగా భ్రమరాంబికా దేవి



భీమడోలు: కురెళ్లగూడెంలో అమ్మవారిని కరెన్సీతో అలంకరించిన దృశ్యం

నిడమర్రు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లోని అమ్మవార్లను సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అడవికొలను కేశవస్వామి ఆలయంలో సరస్వతీ దేవికి చిన్నారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలపర్రులోని ఉమా నీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలోని సరస్వతీ దేవి అలంకరణలో ఉన్న ఉమాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బువ్వనపల్లి, పత్తేపురం, పెదనింద్రకొలను గ్రామాల్లో సరస్వతి దేవి అలంకరణ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారికి విశేష పూజలు

భీమడోలు: మండలంలోని భీమడోలు, గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, నరేడ్లగూడెంలోని ఆలయాల్లో అమ్మవార్ల ఆలయాల్లో ఆరో రోజైన శుక్రవారం సరస్వతీదేవి అవతారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.విద్యార్థులు ఆలయాలకు తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. గుండుగొలనులోని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.పూళ్ల, ఎంఎం పురం గ్రామాల ఇలువేల్పు భవానమ్మ సరస్వతీ దేవిగా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో, కురెళ్లగూడెంలో దసరా మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. కురెళ్ల గూడెంలో అమ్మవారికి రూ.3లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

గోపన్నపాలెంలో.

దెందులూరు: గోపన్నపాలెం కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో దెందులూరు 1వ వార్డు సెంటరులో శుక్రవారం సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. దెందులూరు సాయిబాబా ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

సరస్వతీ దేవికా అంబికాదేవి

పెదపాడు: ప్రసిద్ధి చెందిన అంబికా దేవి ఆలయంలో శుక్రవారం సామూహిక సరస్వతీ దేవి పూజ శుక్రవారం నిర్వహించారు. దేవీ నవరాత్రులు సందర్భంగా ఆలయ ప్రాంగణం సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సరస్వతీ దేవి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లును నిర్వహకులు అంబికా ప్రసాద్, అంబికా ప్రసాద్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెదపాడులోని గంగాపార్వతీ సమేత సోమేశ్వరర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సామూహిక సరస్వతీ దేవి పూజలు చేసారు.

కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో..

గణపవరం : గణపవరం కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు చేశారు. గణపవరం వర్తక సంఘ భవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు వాసవీమాతకు పూజలు చేశారు.

గ్రంథాలయాలకు పుస్తకాల అందజేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదిబాట శతకము, హనుమ శతకము అనే రెండు పుస్తకాల ప్రతులను రచయిత, చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వానపల్లి ఆదిబాబు శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీకి అందజేశారు. ఆయన రచించిన సుమారు రూ.7 వేల విలువైన 150 ప్రతులను జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో పాఠకులకు అందుబాటులో ఉంచాలని ఆదిబాబు కోరారు. ఈ సందర్భంగా చీర్ల పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న దసరా విజ్ఞన శిబిరంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ప్రజలకు మేలు

ఏలూరు రూరల్: గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అబాడి, మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజడ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియా) వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఏలూరు రూరల్ మండల ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. శుక్రవారం ఆమె చాటపర్రులో సచివాలయ సిబ్బందితో కలిసి ఇళ్ల సర్వే చేపట్టారు. గ్రామాల్లో ఇళ్లు, భూమి విస్తీర్ణం సేకరించి స్వామిత్వ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నట్టు ఆమె చెప్పారు. దీంతో గ్రామీణ ప్రజల ఇళ్లు, భూములపై సాంకేతికంగా పక్కా సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. 15 గ్రామాల్లో సచివాలయ, పంచాయతీ సిబ్బంది చురుగ్గా సర్వే చేస్తున్నారని చెప్పారు.

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటో, మోటార్ వాహన డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు నగర అధ్యక్షులు పుప్పాల కన్నబాబు కోరారు. స్థానిక త్రిచక్ర ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కన్నబాబు మాట్లాడారు. ఆటో, మోటారు వాహనాలపై పెనాల్టీలు పెంచుతూ విడుదల చేసిన జీఓ 21, 31 రద్దు చేయాలన్నారు. వాహనదారులపై ఉన్న పాత పోలీసు ఈ చలానాలు రద్దు చేసి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోలు, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. ప్రమాదాల నివారణ పేరుతో కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ నెంబర్ 894ను రద్దు చేయాలని కోరారు. ఏలూరు నగరంలో ఆటోలు, మోటార్ వాహనాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు.